క్లుప్తంగా

మల్లేలమ్మ తల్లికి వెండి కిరీటం బహూకరణ


వెండి కిరీటాన్ని ఆలయ అర్చకులకు అందజేస్తున్న కుటుంబ సభ్యులు

వేంపల్లె : ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ ఆవరణలో ఉండే మల్లెలమ్మతల్లి ఆలయానికి వీరన్నగట్టుపల్లి గ్రామానికి చెందిన రాచవీటి మారన్న, రాజేశ్వరమ్మ దంపతులు రూ.40వేలు విలువ చేసే వెండి కిరీటం బహూకరించారు. పూజారి వెంకటప్రసాద్‌కు కిరీటాన్ని అందించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో భాగవత పఠనం


భాగవత పఠనంలో పండితులు

లింగాల : ఎగువపల్లెలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధల నడుమ భాగవత పఠనం నిర్వహించారు. పులివెందుల భక్త సమాజం నిర్వహణలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఈనెల 23 వరకు భాగవత సప్తాహ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల పండితులు, వక్తలు పాల్గొన్నారు. అలాగే ప్రజలు సుభిక్షంగా ఉండాలని వెలిదండ్ల వరదరాజులస్వామి ఆలయంలో చాతుర్మాస దీక్షను ప్రారంభించారు. నవంబర్‌ 15 కార్తీక మాసంలో పౌర్ణమి వరకు దీక్షలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

నిత్యావసర సరుకులు వితరణ


దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న కుటుంబ సభ్యులు

పులివెందుల : స్థానిక పార్నపల్లి రోడ్డులోని డీఎస్‌రెడ్డి కాంప్లెక్స్‌లో ఉన్న శరణ్యా ఆసుపత్రిలో ప్రముఖ వైద్యులు శరణ్యా నవీన్‌కుమార్‌ కుమార్తె సాయినవీషా పుట్టినరోజును పురస్కరించుకుని దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్‌ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, డాక్టర్‌ శరణ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

జమ్మలమడుగు : స్నేహితులు కలిసి ఆపదలో ఉన్న తోటి సహచరుడికి రూ.25 వేలు వితరణ చేశారు. ఇటీవల ఆపరేషన్‌ చేయించుకున్న మహబూబ్‌బాషా తల్లి ఖాజాబి అనారోగ్యంతో బాధపడుతుండటంతో పతంగే రామన్నరావు హైస్కూల్‌ సొసైటీని ఏర్పాటు చేసిన వారు తమవంతు సాయం చేస్తున్నారు. కార్యక్రమంలో పఠాన్‌ఖాజాషరీఫ్‌ఖాన్‌, మహమ్మద్‌ మజహర్‌ ఆలీ, ఖాజామోహిద్దీన్‌, చక్రపాణి, రంజిత్‌కుమార్‌, రామకృష్ణ, రాముడు జయవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు

పులివెందుల రూరల్‌ : నేటినుంచి కుష్టు వ్యాధికి సంబంధించి ఎన్‌సీడీసీ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించనున్నారు. అందులో భాగంగా మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నేటి నుంచి ఆగస్టు 2 వరకు కుష్టువ్యాధికి సంబంధించి అనుమానితులను గుర్తించే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు డిప్యూటీ పారామెడికల్‌ ఆఫీసర్‌ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొని ఇంటింటికి వెళ్లి కుష్టువ్యాధి గ్రస్తులపై సర్వే నిర్వహించాలన్నారు.

ఘనంగా ఏకలవ్యుని జయంతి


ఏకలవ్యునికి నివాళులర్పిస్తున్న ఎరుకుల సంఘం అధ్యక్షుడు చెన్నకేశవులు, తదితరులు

పులివెందుల రూరల్‌ : పట్టణంలోని వెంకటేశ్వర ఎరుకుల సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్యుని జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నగరిగుట్టలోని రామాలయం సమీపంలో వెంకటేశ్వర ఎరుకుల సంఘం అధ్యక్షులు చెన్నకేశవులు ఆధ్వర్యంలో ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు వెంకటపతి, చలపతి, ఎరుకుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్‌ : ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి అలసత్వం లేకుండా 12వ పీఆర్సీకి సంబంధించి నమధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్టీ యూ కడప జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వరరెడ్డిలు డిమాండ్‌ చేశారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం వేడుకలు

కమలాపురం : మండల ప్రజలు మొహర్రం వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. బుధవారం పట్టణంలోని కుళాయిస్వామి దర్గాతో పాటు బీడీ కాలనీ, కె.అప్పాయపల్లె, గోపులాపురం, జీవంపేట, విభరాపురం, చిన్నచెప్పలి, పెద్దచెప్పలి, పందిళ్లపల్లె, కోగటం, పాడదుర్తి తదితర గ్రామాల్లో కుల మతాలకు అతీతంగా మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. పీర్ల చావిడీల్లో ప్రతిష్ఠించిన పీర్ల వద్దకు భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రత్యేక ఫాతెహ నిర్వహించారు. భక్తులకు చక్కెర పంచిపెట్టారు. విభరాపురంలో నూతనంగా నిర్మించిన దర్గాలో మహమ్మద్‌ ప్రవక్త (స.అ.స.) మనుమళ్లు హసేన్‌, హుసేన్‌ల చిత్ర పటాలతో పాటు పీర్లు ప్రతిష్ఠించారు. పీర్లను బంగారు నగలతో ప్రత్యేక అలంకరణ చేశారు. వాటిని చూసేందుకు భక్తులు ఆసక్తి చూపారు. అర్ధరాత్రి వరకు పలు గ్రామాల్లో పీర్లను డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. పీర్లు తమ ఇండ్ల వద్దకు వచ్చినపుడు భక్తులు ఫాతెహ నిర్వహించారు. అనంతరం పీర్లను ఎత్తుకొని అగ్ని గుండం ప్రవేశం చేశారు. పలు చోట్ల అన్నదానం నిర్వహించారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్‌ : మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె, కొత్తపల్లె గ్రామాల్లో మొహర్రం వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కుళ్లాయిస్వామి, మస్తాన్‌స్వామి పీర్లకు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామాల్లో భక్తులు చెక్కర చదివింపులు ఇచ్చి స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామాల్లో ప్రజలు పీర్ల చావిడి వద్దకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీర్లను ఎత్తుకోవడానికి పెద్ద సంఖ్యలో ప్రజలు పోటీపడ్డారు.


పులివెందుల గ్రామోత్సవంలో కుళ్లాయిస్వామి, మస్తాన్‌స్వామి పీర్లు

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని పలు గ్రామాల్లో పీర్ల గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వల్లూరు, పెద్దపుత్త, తప్పెట్ల, దిగువపల్లె తదితర గ్రామాల్లో గ్రామోత్సవాలను నిర్వహించారు. పీర్ల చావిడి దగ్గర ప్రత్యేక ఫాతెహాలను నిర్వహించారు. రాత్రి పెద్ద గుండం కాల్చే కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.


విభరాపురంలోని దర్గాలో ప్రత్యేక బంగారు, వెండి నగల అలంకరణలో పీర్లు


పెద్దపుత్తలో పీర్ల గ్రామోత్సవం


సింహాద్రిపురంలో అగ్నిగుండప్రవేశం చేస్తున్న పీర్లు

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని పెండ్లిమర్రి, వెల్లటూరు గ్రామాల్లో బుధవారం మొహర్రం వేడుకలను ప్రజలు కులమతాలకు అతీతంగా ఘనంగా జరుపుకున్నారు. పీర్లకు ఎదురుగా గుండం ఏర్పాటుచేసి గుండం ప్రవేశం చేశారు. సాయంత్రం బాణా సంచా, డప్పు వాయిద్యాల మధ్య పీర్ల ఊరేగింపు చేశారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె: మండలంలోని గంగిరెడ్డిపల్లె, మిట్టపల్లె, ఉరుటూరు గ్రామాల్లో పీర్ల గ్రామోత్సవం బుధవారం వైభవంగా సాగింది. గ్రామోత్సవంలో కుల మతాలకు అతీతంగా యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పీర్లను ఎత్తుకుని గుండప్రవేశం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం కులమతాలకు అతీతంగా అస్సేన్‌ హుస్సేన్‌, బాబావల్లి, గూగూడు కుళ్లాయిస్వామి పీర్లతో పాటు పలు పీర్లను డప్పు వాయిద్యాల నడుమ పురవీధులలో ఊరేగించారు. అగ్నిగుండ ప్రవేశం చేశారు. ప్రజలు భారీగా తరలివచ్చారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : 10 రోజుల నుంచి కొలువుదీరిన పీర్లు భక్తుల కోలాహలం మధ్య ఏటికి బయలుదేరాయి. జమ్మలమడుగు రహదారిలోని చావిడిలో కొలువుదీరిన పీర్లు భక్తులు తమ కానుకలు, మొక్కుబడులు చెల్లించి పూజలందుకున్నాయి. భక్తులు పీర్ల గ్రామోత్సవంలో పాల్గొన్నారు.


లింగాలలో అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న పీర్లు


కమలాపురం : విభరాపురంలో పీర్లను ఊరేగిస్తున్న గ్రామస్తులు

లింగాలలో..

లింగాల : మండలంలో మొహర్రం ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని లింగాల, లోపట్నూతల, మురారిచింతల, తేర్నాంపల్లి, దొండ్లవాగు, తదితర గ్రామాల్లో వేడుకలను నిర్వహించారు. సాయంత్రం పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేసి చెరువుల వద్దకు తీసుకెళ్లారు. అక్కడ పీర్లను కడిగి మూటగా కట్టి ఫాతిమా పాటలను పాడుకుంటూ తిరిగి చావిడికి చేరుకున్నారు.

నేటి నుంచి జాతల పీర్లు

గురువారం నుంచి జాతల పీర్ల ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ముజావర్లు తెలిపారు. రెండు రోజుల పాటు జాతల పీర్ల ఉత్సవాలు నిర్వహిస్తామని వారు తెలిపారు.

చెన్నూరులో..

చెన్నూరు : మండలంలోని కొండపేట గ్రామంలో పీర్లను పెన్నా నది వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చారు. కులమతాల కతీతంగా అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు.


పెండ్లిమర్రిలో పీర్లను ఊరేగింపుగా తీసుకెలుతున్న గ్రామస్తులు


వీఎన్‌పల్లె : గంగిరెడ్డిపల్లె గ్రామోత్సవంలో పీర్లు


అప్పాయపల్లెలో జరిగిన పీర్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


కొండపేటలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

మానవాళి రక్షణ కోసం ప్రాణాలు అర్పించారు


ప్రత్యేక ఫాతేహాలు చేస్తున్న పీఠాధిపతి సాదిక్‌పాషా ఖాద్రీ

జమ్మలమడుగు : ప్రపంచ ఇస్లాం మతం విశ్వవ్యాప్తంగా కాపాడేటందుకు మహమ్మద్‌ ప్రవక్త మనవడు హజరత్‌ఆలీ కుమారులులైన హజరత్‌ ఇమాం హుస్సేన్‌, ఇమామే హసన్‌లు ర్బాలా మైదానంలో కాఫీర్‌లతో పోరాటం చేసి ప్రాణాలను అర్పించారని జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్‌షా సాదిక్‌పాషాఖాద్రీ తెలిపారు. వారిని స్మరించుకుని మొహర్రం పండుగను జరుపుతున్నామని ఆయన అన్నారు. అనంతరం ఉపవాసం ఉన్న వారికి ఇఫ్తార్‌ విందు నిర్వహించారు.

నేడు విద్యుత్‌ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్‌ : పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ మరమ్మతుల కారణంగా పట్టణంలో సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. సబ్‌స్టేషన్‌ పరిధిలో ఫీడర్‌ కింద ఉన్న పులివెందుల మెయిన్‌ రోడ్డు, అంబకపల్లె రోడ్డు, బైపాస్‌రోడ్డు, లే అవుట్‌, ఎస్‌బీఐ కాలనీ, కడప రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సంబంధిత అధికారులకు సహకరించాలని కోరారు.

ఆలయాలల్లో తొలి ఏకాదశి పూజలు

పులివెందుల టౌన్‌ : పట్టణంలోని శ్రీమిట్టమల్లేశ్వర స్వామి ఆలయంలో వెలసిన శ్రీసత్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని శ్రీలక్ష్మీ భూలక్ష్మి సమేత శ్రీసత్యనారాయణస్వామి వ్రతాన్ని, కల్యాణాన్ని కన్నుల పండువలా నిర్వహించారు. జూటూరు నాగసుగుణాకర్‌ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పురోహితులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. మంగళసూత్రాలను భక్తులకు చూపిస్తూ స్వామివారికి తాకించి అమ్మవార్ల మెడలో అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ముందుగా సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించి వ్రతం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను కథ చదివి వినిపించారు. సాయంత్రం శ్రీలక్ష్మీ, భూలక్ష్మి సమేత శ్రీసత్యనారాయణస్వామి ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. పట్టణంలోని అతిపురాతనమైన శ్రీరంగనాథస్వామి ఆలయంలో ఆలయ అర్చ కులు కృష్ణ రాజేష్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించి పూజలు జరిపించారు.

పులివెందుల రూరల్‌ : మండల పరిధిలోని గ్రామాల్లో హిందువుల తొలిపండుగగా పిలువబడే తొలి ఏకాదశి వేడుకలను గ్రామీణ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. మండలంలోని నల్లపురెడ్డిపల్లె, కొత్తపల్లె, ఎర్రబల్లె, తుమ్మలపల్లె, అచ్చవెల్లి, ఎర్రిపల్లి, కనంపల్లె గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కూడా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల పేరుమీద ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

వేములలో..

వేముల : మండల వ్యాప్తంగా తొలిఏకాదశి పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామునుంచే భక్తులు ఆలయాలకు చేరుకున్నారు.


పులివెందులలో సతీసమేత కల్యాణ సత్యనారాయణస్వామి


ప్రత్యేక అలంకారంలో శ్రీరంగనాథస్వామి

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : తొలిఏకాదశి పండుగను పురస్కరించుకుని శ్రీభానుకోట సోమేశ్వరస్వామి క్షేత్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో తొలిఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. భానుకోట సోమేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ఉదయం ప్రాతఃకాల పూజలు, అర్చనలు, అభిషేకాలను ఆలయ అర్చకులు బద్రీశర్మ, సురేష్‌ శర్మలు నిర్వహించారు.

కమలాపురంలో..

కమలాపురం : మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం తొలి ఏకాదశి వేడుకలు నిర్వహించుకున్నారు. గ్రామాల్లో వెలసిన రామాలయాలు, కృష్ణాలయాలు, మోక్ష నారాయణస్వామి ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాపురంలో వెలసిన శ్రీ మహాలక్ష్మి సమేత మోక్ష నారాయణస్వామి ఆలయంలో భక్తులు ఉత్తర ద్వార దర్శనం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన సేవకుడు సాయినాథశర్మ దంపతుల ఆధ్వర్యంలో వేద పండితుల ఆచారత్వమున ఉత్తర ద్వార దర్శనం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని సంగాలపల్లెలో వెలసిన శ్రీ శివకృష్ణ గోశాల, వేంపల్లె, ఎర్రగుంట్ల ప్రధాన రహదారిలోని పాలగిరి క్రాస్‌ వద్ద వెలసిన కాశిరెడ్డినాయన, సాయిబాబా ఆలయాల్లో బుధవారం తొలి ఏకాదశి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు కాశిరెడ్డి నాయన ఆలయంలో ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.


సింహాద్రిపురం : భానుకోట సోమేశ్వర స్వామి

వల్లూరులో..

వల్లూరు : తొలి ఏకాదశి పండుగను మండల వ్యాప్తంగా ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామాల్లో అందుబాటులో వున్న ఆలయాలకు వెళ్లి దైవ దర్శనం చేసుకున్నారు. జొన్న పేలాలను, బెల్లాన్ని ప్రసాదాలుగా పెట్టి గృహాల్లో పూజలు చేశారు. పుష్పగిరిలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామికి ఆలయ అర్చకులు అభిషేకాలను, ప్రత్యేక పూజలను నిర్వహించి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.


రామాపురంలో మోక్ష నారాయణస్వామి

వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నాయకుడికి నివాళి


మాచునూరులో చంద్రారెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న కడప ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి


చంద్రారెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్‌ రమ్యతారెడ్డి

పెండ్లిమర్రి : మండల సీనియర్‌ నాయకుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ మాచునూరు చంద్రారెడ్డి(76) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. బుధవారం స్వగ్రామం మాచునూరులో అంత్యక్రియలు నిర్వహించారు.

కడప ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, కడప మేయర్‌ సురేష్‌బాబు, మాజీ ఆర్టీసీ చైర్మన్‌ మల్లికార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కుమార్తె డాక్టర్‌ రమ్యతారెడ్డి, మాజీ హోంమంత్రి మైసూరారెడ్డి తమ్ముడు రమణారెడ్డి, కుమారుడు, ఎర్రగుంట్ల మున్సిపల్‌ చైర్మన్‌ హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీ వైస్‌ చైర్మన్‌ బాలయ్య, వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వేంపల్లె సతీష్‌రెడ్డి తనయుడు నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, జిల్లా నుంచి వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు అంత్యక్రియలకు హాజరై నివాళి అర్పించారు.

రసాయన ఎరువులతో ఆహార ఉత్పత్తులు విషతుల్యం

వేంపల్లె : రైతులు పంట సాగులో రసాయన ఎరువులు అధికంగా వాడటం వల్ల ఆహార ఉత్పత్తులు విషతుల్యం అవుతాయని నవభారత్‌ ఫర్టిలైజర్స్‌ ఫీల్డ్‌ ఆఫీసర్‌ కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం వేంపల్లి మండలంలోని తాళ్లపల్లె, కత్తలూరు గ్రామాల్లో ఆయన ర్యాలీ నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు వాడకం వల్ల క్రమక్రమంగా భూమిలో భూసారం తగ్గిపోయి పంట దిగుబడులు తగ్గుతాయన్నారు. మానవ, జంతువాలికి ముప్పువాటిల్లే ప్రమాదం ఉందన్నారు. రైతులు సేంద్రీయ జీవన ఎరువులు వాడటం ఎంతో ఉత్తమమన్నారు. వాటిని వాడటం వల్ల పెట్టుబడులు తగ్గడమే కాకుండా అధిక దిగుబడిని పొందవచ్చన్నారు. అలాగే జీవన ఎరువులు పంటకు భూమిలోని మిత్ర పురుగులు అయినటువంటి సూక్ష్మజీవులను అభివృద్ధి చేసి మొక్కలకు కావాల్సిన పోషకాలను అందించి మొక్కలలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఫర్టిలైజర్స్‌ ఫీల్డ్‌ ఆఫీసర్‌ కృష్ణమూర్తి

21న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

వేముల : మండలంలో ఈనెల 21న గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సాయిబాబా ఆలయాలను నిర్వాహకులు ముస్తాబు చేస్తున్నారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని భూమయ్యగారిపల్లెలో భక్తులకు అన్నదానంతోపాటు సీనియర్‌ విభాగంలో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వృషభాలకు మొదటి బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.80వేలు, తృతీయ బహుమతి రూ.60వేలు, నాల్గవ బహుమతి రూ.50వేలు, ఐదవ బహుమతి రూ.40వేలు, ఆరవ బహుమతి రూ.30వేలు, ఏడవ బహుమతి రూ.20వేలు, ఎనిమిదవ బహుమతి రూ.10వేలు చొప్పున అందించనున్నారు. పోటీలలో పాల్గొంటున్న వృషభాలకు కన్సలేషన్‌ బహుమతులను కూడా ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వెంకటేశ్వరునికి అందని నిత్య కైంకర్యాలు

వేంపల్లె : దేవస్థానం అధికారుల నిర్లక్ష్యం వల్ల వేంపల్లిలో వెలసిన శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి వారికి నిత్య కైంకర్యాలు అందడం లేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్‌ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంపల్లె గ్రామంలో ఎద్దులకొండపై ఉన్న వృషభాచలేశ్వరస్వామి దేవస్థానానికి అనుసంధానమైన వెంకటేశ్వర స్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో రూ.100 కోట్లకు పైగా విలువ చేసే ఆస్తులుండి ఏటా ఒక కోటి రూపాయల ఆదాయం వస్తున్నా అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల స్వామి వారికి సేవలు చేయకపోవడం దారుణమన్నారు. శ్రీ మహావిష్ణువు యోగనిద్రకు ఉపక్రమించే సమయంలో హిందువులు నిర్వహించుకునే తొలి ఏకాదశి పండుగ సందర్భంలో దేవస్థానంకు వచ్చే భక్తులకు కనీస వసతులు కల్పించకపోవడం దారుణమన్నారు. దిట్టం సరుకుల కింద ప్రభుత్వం నెలకు రూ. 18వేలు ఇస్తుంటే భక్తులకు ప్రసాదం కూడా ఇవ్వలేదన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్‌ మెడికల్‌ సెంటర్‌(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణుల ఆధ్వర్యంలో చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్‌, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్‌ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌, మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్‌ ఎస్‌.సౌజన్య మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు సోరియాసిస్‌, తామర, గజ్జి, ఫంగస్‌ ఇన్‌ఫెక్షన్‌, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సబ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ, మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్‌ నెంబర్లను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి మస్తాన్‌స్వామి ఉరుసు ఉత్సవాలు

పెండ్లిమర్రి : భక్తులు కోరిన కోర్కెలు తీర్చే మస్తాన్‌ స్వామి ఉరుసు ఉత్సవాలు గురువారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు తెలిపారు. రవి ఉదయించిన రాజ్యమున శ్రీసంఘమేశ్వరుని పాదాన, పాపాఘ్నినది తీరాన అనేక కళలకు నిలయమై తెలుగు మెడలో మంచి ముత్యంలా మేరిసే కొండూరు గ్రామంలో దాదాపు శతాబ్దాల కాలంలో మస్తాన్‌ స్వామి వెలిశాడని అక్కడి పురాణాలు చేబుతున్నాయి. భూత పిశాచాలు ఉన్న వారికి అన్ని దృష్ట శక్తులను తొలగిస్తాడని అక్కడి భక్తుల నమ్మకం. ఈ ఉత్సవాలు కుల మతాలకు అతీతంగా నిర్వహిస్తారు. గురువారం ఉదయం స్వామివారికి అలయ ఆవరణలో గుండము, మధ్యాహ్నం గంధము, రాత్రికి స్వామి వారి ఉరేగింపు వైభవంగా నిర్వహిస్తామన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం రెండవ రోజున స్వామివారి ఊరేగింపు ఉంటుందన్నారు. చూట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి స్వామి ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.


విద్యుత్‌ కాంతులతో విరాజిల్లుతున్న మస్తాన్‌ స్వామి గుడి